క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లికి పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు: జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్య క్షేత్రం తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో కొలువై ఉన్న గుంటి గంగా భవానీ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట,నాగ శిలలు, మల్లికార్జున స్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

రెండు ఉద్యోగాలు సాధించిన యువకుడు



నాసర్ వలి

కురిచేడు: సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన యువకుడు రెండు ఉద్యోగాలు సాధించాడు. కురిచేడు మండలం పడమర నాయుడు పాలెం గ్రామ పంచాయతీకి చెందిన షేక్ నాసర్‌వలి రెండు ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల జరిగిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించాడు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్‌జీటీ విభాగంలో జిల్లా 28వ ర్యాంకు సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన అతను ఏకకాలంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తా సాధించడంపై గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

తాళ్లూరు ఏఎస్సైగా భాస్కర్‌రావు



భాస్కరరావు

తాళ్లూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్సైగా సీహెచ్ భాస్కర్‌రావు నియమితులయ్యారు. ఆయన జిల్లా హెడ్‌క్వార్టర్‌లో ఏఎస్సైగా పనిచేస్తూ బదిలీపై తాళ్లూరు వచ్చారు. ఇక్కడ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జీ మోహన్‌రావు కురిచేడుకు బదిలీపై వెళ్లినట్లు సమాచారం. ప్రజలకు అందుబాటులో ఉండి ఎస్సై ఆదేశాల మేరకు తగిన సేవలు అందిస్తానన్నారు.



వినాయక విగ్రహానికి రంగులు వేస్తున్న యువకులు



రంగురంగుల గణనాథుల విగ్రహాలు

గణనాయకా.. ఘన స్వాగతం!

- వినాయక చవితి పండుగకు సన్నాహాలు
- వినాయక విగ్రహాల తయారీతో రాజస్థానీలకు జీవనోపాధి
- ఆకట్టుకుంటున్న రంగు రంగుల గణనాథుల విగ్రహాలు
- నిబంధనలు పాటించాలంటున్న పోలీసులు



వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న యువకులు

తాళ్లూరు: కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో సంప్రదాయ పద్ధతిలో జరుపుకునే పండుగలో వినాయక చవితి పండుగ ముందు వరుసలో ఉంటుంది. ప్రతి ఏటా ఇంటిల్లిపాది పిల్లలు, పెద్దలు ఈ పండుగను జరుపుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. విఘ్నాలు తొలగిపోయి వినాయకుడి ఆశీస్సులతో విజయం అందిస్తాడని ప్రజల నమ్మకం. దీనిలో భాగంగా ప్రతి ఏటాలాగానే ఈ సంవత్సరం కూడా రాజస్థానీలు కుటుంబ సమేతంగా తూర్పు గంగవరం గ్రామంలో నివాసం ఏర్పాటు చేసుకొని వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులను సిద్ధం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వారు తయారు చేసే వినాయక విగ్రహాలు రంగు రంగులతో ఆకర్షణీయంగా ఉండటం వలన ప్రజలకు ఆకట్టుకుంటున్నాయి. వినాయక చవితి పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామాల్లో భక్తులు, పెద్దలు, యువకులు ఉత్సాహంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈనెల ఆగస్టు 27 తేదీన వినాయక చవితి పండుగ సందర్భంగా యువకులు మండలంలో పలుచోట్ల మందిరాలు ముమ్మరంగా ముస్తాబు చేస్తున్నారు. మండలంలో యువకులు దాదాపు 50 శాతంపైనే వినాయక విగ్రహాలకు అడ్వాన్సులు చెల్లించి బుక్ చేసుకున్నారు.

గ్రామాల్లో పోటాపోటీగా ఉత్సవాలు నిర్వహణ..

మండలంలో మొత్తం 26 గ్రామాలు ఉండగా దాదాపు 50కి పైనే విభిన్న రూపాల్లో వినాయక విగ్రహాలు మండపంలో యువకులు ఏర్పాటు చేసి మూడు నుంచి పదకొండు రోజులు పోటా పోటీగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనం చేస్తున్నట్లు సమాచారం.

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలి..

పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టితో లేక పేపర్‌తో చేసిన వినాయక విగ్రహాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలు నీటిలో నిమజ్జనం చేయడం వలన నీరు కలుషితమైపోతుందని, అందరూ మట్టి వినాయకులకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.

గణేష్ విగ్రహాల తయారీనే జీవనాధారం..



10 సంవత్సరాల నుంచి తూర్పుగంగవరంలోనే ఉంటూ వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాం. గత సంవత్సరం 210, ఈఏడాది 230 గణేష్ విగ్రహాలను తయారు చేశాం. పెట్టుబడి రూ.20 లక్షల వరకు అవుతుంది. మొత్తం 10 మంది కార్మికులు ఐదు నెలలు కష్టపడి పనిచేశాం. విగ్రహాలు పూర్తిస్థాయిలో అమ్ముడుపోతేనే మంచి లాభాలు ఉంటాయి. ఇదే మా జీవనోపాధి. మిగిలిన ఏడు నెలలు ఖాళీగా ఉండాలి.

– బీర రామ్, రాజస్థాన్

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి..



వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు పోలీసుల అనుమతులు తీసుకోవాలి. మండపాల ఏర్పాటు బహిరంగా ప్రదేశాల్లో కాకుండా ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చేసుకోవాలి. మండపాల వద్ద తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రజలను రెచ్చగొట్టే విధంగా పాటలు పెట్టకూడదు. అలాగే వినాయక నిమజ్జనం రోజున పోలీసుల ఆంక్షల నడుమ చేసుకోవాలి. ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పండుగకు మూడు రోజుల ముందే అనుమతి తీసుకోవాలి. మద్యం తాగి అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. దీనికి కమిటీ సభ్యులు బాధ్యతలు వహించాలి.

– మల్లికార్జునరావు, ఎస్సై

ప్రజలను నిలువునా మోసం చేశారు



పాతఅన్నసముద్రంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం
- త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం

త్రిపురాంతకం: సీఎం చంద్రబాబు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి నమ్మి ఓట్లేసిన ప్రజలను నిలువునా మోసం చేశారని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ ఆళ్ల అంజలీదేవి రామయోగిరెడ్డి, మాజీ సర్పంచ్ పీసీహెచ్ వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రం గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడం దారుణమని అన్నారు. ఎన్నికల్లో ఏదోక విధంగా గెలవాలని హామీలిచ్చారన్నారు. సంవత్సరమైనప్పటికీ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు అన్నీ గ్రహిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి పింఛన్లను కూటమి ప్రభుత్వం రద్దు చేసి రోడ్లపై పడేసిందని విమర్శించారు. వెంటనే పింఛన్లు పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జెట్టి హరినాథ్, పోత్రాజు, డి.గోవిందులు, వి.వెంకటేశ్వర్లు, పల్లె సామ్యేలు పాల్గొన్నారు.

జమ్మిదోర్నాలలో...

పెద్దదోర్నాల: మండల పరిధిలోని జమ్మిదోర్నాలలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు సర్పంచ్ కొంగరి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బోయపాటి ఆవులయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గుండారెడ్డి రమణారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు వడ్డెళ్లి ఆదిశేషయ్య, నుసుళ్లపల్లి నాగేశ్వరరావు, బత్తినేని రామకృష్ణ, చాట్ల గంగయ్య, పులుకూరి కోటేష్, సోషల్ మీడియా కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జమ్మిదోర్నాలలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

తాళ్లూరు: వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని దర్శి డీఎస్పీ బీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్‌ను ఆదివారం రాత్రి డీఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా రికార్డులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి పండుగ, నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. అందుకు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటున్న వారు కమిటీగా ఏర్పడి అక్కడ విద్యుత్తో పాటు ఇతర సౌకర్యాలను జాగ్రత్తగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పోలీస్ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. గణేష్ ఉత్సవ్ డాట్ నెట్‌లో సింగిల్ విండో పద్ధతిలో పోలీస్ శాఖ అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. వెబ్ సైట్లో నమోదు చేసుకోలేని వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై మల్లికార్జున రావు, ఏఎస్ఐ మోహన్‌రావు, భాస్కర్ రావు, కానిస్టేబుల్ దారా బ్రహ్మనాయుడు ఇతరులు ఉన్నారు.



తొర్రగుడిపాడు వెళ్లే రోడ్డు పక్కన...



సంతనూతలపాడు చెరువు దాటిన తర్వాత...



సంతనూతలపాడు పశువుల సంత సమీపంలో...

పచ్చదనం పోయి.. ప్రమాదాలు మిగిలి !

- పేర్నమిట్ట నుంచి చీమకుర్తి వరకు సుమారు 30కిపైగా ఎండిపోయిన భారీ వృక్షాలు
- విరిగి పడిపోయే స్థితికి చేరి ప్రమాదకరంగా మారిన వైనం
- ఒంగోలు-కర్నూలు రోడ్డుపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

ఒంగోలు సబర్బన్:

చెట్లు నాటడమంటే గుర్తుకొచ్చేది అశోక చక్రవర్తి. ప్రాథమిక విద్యలో అశోకుడు చెట్లు నాటడంపై ఒక పాఠ్యాంశమే ఉంటుంది. ఆనాడు మొదలైన చెట్లు నాటడం కొనసాగుతూ వచ్చింది. ప్రధాన రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు భారీ వృక్షాలుగా ఎదిగి పచ్చదనం, నీడతో కనువిందు చేస్తూ ఉంటాయి. ముఖ్యంగా ఒంగోలు-కర్నూలు రోడ్డుపై పేర్నమిట్ట నుంచి పొదిలి వరకు రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. అయితే, ఆధునిక సమాజంలో వాహనాల రద్దీ పెరగడం, సింగిల్ రోడ్లను డబుల్ చేయడం, ఫోర్ వే, సిక్స్ వే అంటూ రోడ్లను విస్తరిస్తుండటంతో అనేక భారీ వృక్షాలు కనుమరుగైపోతున్నాయి. అయితే, ఒంగోలు – కర్నూలు రోడ్డులో ఒంగోలు సమీపంలోని పేర్నమిట్ట నుంచి పొదిలి, మార్కాపురం, గిద్దలూరు రహదారులు వెంట ఉన్న చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. ఎందుకు ఎండుతున్నాయో కూడా ఎవరికీ అంతుబట్టడం లేదు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు వాటి గురించి కనీసం కూడా పట్టించుకోవడంలేదు. దాంతో ఒంగోలు-చీమకుర్తి మధ్యలోనే దాదాపు 30కిపైగా భారీ వృక్షాలు నిలువునా ఎండిపోయాయి.



రోడ్డు పక్కన ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని మీ కోసంలో జేసీకి వినతిపత్రం అందిస్తున్న పర్యావరణవేత్త శ్రీనివాసరావు

ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికుల ఆందోళన...

ఒంగోలు-కర్నూలు రోడ్డులో పేర్నమిట్ట – చీమకుర్తి మధ్యలో రహదారి వెంట ఇరువైపులా ఎండిపోయిన భారీ వృక్షాలు ఉన్నాయి. చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ మొదలుకుని పేర్నమిట్ట వరకు ఎండిపోయిన చెట్లు బొగిలిపోయాయి. ఏ క్షణానైనా విరిగిపడిపోయే స్థితిలో ఉన్నాయి. మొదలుతో సహా విరిగి రోడ్డుకు అడ్డంగా ఎక్కడ పడతాయోనని వాహనదారులు భీతిల్లుతున్నారు. భారీ వృక్షాలు కావడంతో వాహనాల మీద పడితే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో గాలివానలకు ఏ క్షణానైనా చెట్లు విరిగిపడి ఆ సమయంలో ఆ రహదారిపై ప్రయాణించే వాహనాలకు ప్రమాదాలు సంభవించవచ్చని భావిస్తున్నారు.

బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలలో ఏ వాహనంపై పడినా ప్రయాణికుల ప్రాణాలు పోయే అవకాశం లేకపోలేదు. గతంలో ఎండిన చెట్ల కొమ్మలు విరిగిపడి ద్విచక్రవాహనదారులకు ప్రమాదాలు జరిగిన సందర్భాలూ కూడా ఉండటంతో వాటిని గుర్తు చేసుకుంటున్న ప్రజలు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మీ కోసం కార్యక్రమంలో అర్జీ...

చీమకుర్తికి చెందిన పర్యావరణ వేత్త, బిల్డింగ్ వర్కర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండా శ్రీనివాసరావు గత సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎండిపోయి ప్రమాదకరంగా మారిన భారీ చెట్ల గురించి అర్జీ అందజేశారు. ప్రాణాంతక సమస్యపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఆ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆర్అండ్‌బీ ఎస్ఈని పిలిచిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ.. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వారం రోజులు కావస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు ఆ చెట్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఫిర్యాదుదారుడు శ్రీనివాసరావు, ప్రయాణికులు వాపోతున్నారు.



ఒంగోలు-కర్నూలు రోడ్డు పక్కన చీమకుర్తి సమీపంలో ఎండిపోయిన భారీ చెట్టు

వినాయకచవితికి

సిద్ధమవుతున్న విగ్రహాలు



వై.పాలెంలో కొలువుదీరేందుకు వస్తున్న భారీ గణనాథుడు

యర్రగొండపాలెం: వినాయకచవితి పండుగకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 27న వినాయకచవితి సందర్భంగా ప్రారంభమయ్యే ఉత్సవాలకు భారీ గణనాథుల విగ్రహాలను హైదరాబాదు నుంచి కూడా తీసుకొస్తున్నారు. స్థానిక కొలుకుల సెంటర్, భారతీయ స్టేట్ బ్యాంక్, రాములవారి గుడి ప్రాంతాలతో పాటు పట్టణంలోని వీధివీధిలో, మండలంలోని గ్రామాల్లో గణనాథుల విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ముందుగా పోలీసు అనుమతులు పొందాలని, ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సీఐ సీహెచ్ ప్రభాకరరావు సూచించారు.